# గ్రంథాలయసర్వస్వము

ఆంధ్రదేశ, గ్రంథాలయసంఘపక్షమున ప్రకటింపబడు సచిత్రమాసపత్రిక.

సంపుటము ౯] మార్చి, ౧౯౨౫ [సంచిక ౭

సంపాదకుడు: అయ్యంకి వేంకటరమణయ్య.

## విషయసూచిక


| | | |
|---|---|---|
| ౧ | తృతీయ అఖిలభారత గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ | ౧౬౭ |
| ౨ | అఖిలభారత గ్రంథాలయ సంఘము | ౧౭౧ |
| ౩ | గ్రంథాలయములు | ౧౭౨ |
| ౪ | పోతన వేమనలయుగము | ,, |
| ౫ | భారతవర్షమునందలి ప్రాచీనసరస్వతీ భాండారములు | ౧౭౩ |
| ౬ | శ్రీ సరస్వతీనిలయ వార్షికోత్సవము—ధర్మవరము | ౧౭౯ |
| ౭ | భాండాగారములు—పుస్తకములు | ౧౮౨ |


---

వార్షికమూల్యము రు ౩-౦-౦

విడిసంచిక వెల రు ౦-౪-౦.

బెజవాడ.

RSVM01A127 C

# జడకుచ్చులు

సుప్రసిద్ధాంధ్ర కవులగు

## రాయప్రోలు సుబ్బారావు

గారి నూతన గ్రంథము

వెల రు 1—0—0 మాత్రమే

| | | |
|---|---|---|
| జన్మభూమి. | పూజ. | కోయిల. |
| తమ్ముడా ! | విరహవీధి. | కనకము |
| ఆంధ్రమాత. | పిలుపు. | ధ్యానబుద్ధప్రతిమ. |
| ప్రబోధము. | మధుమాలి. | కవిత. |
| పుస్తకము. | గీతాం దేహి. | ఆచారక్షయము. |
| వసంగము. | ప్రవాసరాధిక. | ఒకమాట. |
| శక్తి. | సఖీసంవరణం. | రాధపిలుపు. |
| వసంతవిలాసము. | మేఘము. | తిలకము. |
| శేవ చైత్రము. | ఎవరు ? | రామలింగారెడ్డి. |
| పూవు. | | కలియుగార్జునుడు. |

అను విషయములమీది పద్యము లిందు గలవు.

వలయువా రిట్లు వ్రాయవలెను :—

ఆంధ్ర పరిషత్తు : బెజవాడ






పరబ్రహ్మాత్మికాం దేవీం ♦ భుక్తిముక్తి ఫలప్రదాం
ప్రణమ్య స్తౌమి తామేవ ♦ జ్ఞానశక్తిం సరస్వతీం.

ఆరవ సంపుటము. | గ్రంథాలయ సర్వస్వము | ఏడవ సంచిక.


# తృతీయ అఖిలభారత గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ

కర్నాటక రాష్ట్రమునందున్న బెల్గాం పట్టణ పరిసరమునందు కాంగ్రెసుకై ప్రత్యేకముగ నిర్మితమైన విజయనగరమునందు 1924 సం॥ డిశెంబరు నెల 26 తేదీ ఉదయము 8-30 గంటలకు ఈసభ సమావేశమయ్యెను.

భారతవర్షముయొక్క వివిధభాగములనుండి ౧౫౦ మంది ప్రతినిధులు విచ్చేసిరి. మైసూరు, పుదుక్కోట సంస్థానములనుండియు, బొంబాయి విశ్వవిద్యాలయము నుండియుగూడ ప్రతినిధు లేతెంచిరి. ఇతర సభలతో సంబంధములేకుండ ప్రత్యేక మీసభకుగూడ కొంత మంది ప్రతినిధులు విచ్చేసియుండిరి. భారతవర్షము యొక్క వివిధప్రాంతములనుండి పెక్కుమంది ప్రేక్షక మహాశయులుగూడ విచ్చేసియుండిరి.

ప్రార్థనతో సభ ప్రారంభింపబడెను. ఆహ్వాన సంఘాధ్యక్షులగు శ్రీ డి. కే. భారద్వాజగారు ప్రతినిధులను హృదయపూర్వకముగ స్వాగతమిచ్చిరి. వారి యుపన్యాసమునందు ప్రస్తుత దేశస్థితిగతులను చర్చించి, దేశము నిప్పుడు కలవరపెట్టుచున్న అసంఖ్యాకములగు సమస్యలనుగూర్చి జనసామాన్యమునకు జ్ఞానాభివృద్ధిని గలుగజేయుటకుగాను గ్రంథాలయములను స్థాపింపవలసిన యావశ్యకతను విపులముగా జర్చించిరి. తరువాత దేశబంధు చిత్తరంజనదాసుగారు అధ్యక్షత వహించవలెనని ఉపపాదించుచు వేమవరపు రామదాసు పంతులుగారు, దాసుగారు గ్రామజీవన పునర్నిర్మాణమునకై ప్రారంభించిన నూతన కార్యక్రమమును గూర్చి వివరించి స్వసహాయ విలసితమును స్వపరిపాలనాభాసితంబును నగు గ్రామమునందు గ్రంథాలయము ప్రాధాన్య భాగమై యున్నదని చెప్పిరి. వీరియుపపాదనను జి. హరి సర్వోత్తమరావుగారు కన్నడభాష యందు బలపరిచిరి. మైసూరు సంస్థాన ప్రతినిధియగు సి. చంద్రశేఖరయ్యరుగారు కూడ ఈయుపపాదనను బలపరచుచు దేశబంధుదాసుగారు జనులయొక్క నిజమైనదాసుడనియు అందుచేత ఈసభాధ్యక్షత వహింప దాసుగారు అన్ని విధముల నర్హులనియు జెప్పిరి. అప్పుడు వందేమాతరధ్వానములు జెలంగుచుండ దేశబంధు “దాసుకీజై” అను కేకలు మిన్నుముట్టుచుండ దాసుగారు అధ్యక్ష పీఠమలంకరించి ఈక్రింది విధమున ఉపన్యాసమిచ్చిరి.

## అధ్యక్షుకోపన్యాసము.

ఈ సభకు అధ్యక్షతవహించుట నాకెంతయో ఆనందముగ నున్నది. ఏలయనగా ఈ యుద్యమము ప్రజల

మనమును వారి కుండు కొరతలలో ముఖ్యమగు కొరతను తొలగించుటను గూర్చి ఉద్బోధన జేయుచున్నది. ఈ మూడవ అఖిలభారత గ్రంథాలయ సభను దేశీయమహాజనసభతో బాటు ఈ బెల్గాంపట్టణముననే జరుపుట మిక్కిలి అనుకూలమగు సంగతి. ఇందువలన ఈ యుద్యమమునకు ఎక్కువ ప్రాముఖ్యత గలిగి దేశసేవాతత్పరులు ఎక్కువమంది ఇందును గూర్చి తమశక్తియుక్తులను వినియోగించుటకు తగువిధమున వానిని ప్రేరణ జేయుటకు సావకాశము గలిగినది. మనదేశీయులందరమును ఇప్పుడు భారతీజాతీయతా సాధనిర్మాణమనెడి మహాకార్యమున నిమగ్నులమై యున్నాము. ఇది కేవల రాజ్యతంత్రమును స్వాధీనపరచుకొను పని మాత్రమే గాదు. కావున మన దేశమునందలి అన్నితరగతుల ప్రజలును చేతనైన కృషిజేసి, ఈ మహాకార్యమునకు తోడ్పడవలసియున్నది. నా అభిప్రాయమునందు స్వరాజ్యము ఇంత విపులమైన అర్థము కలదిగా నున్నది ఈ అభిప్రాయమునే నేను ఇదివరలో ఎక్కువగా చెప్పియున్నాను. కొందరు స్వరాజ్యమునకు సంపూర్ణస్వాతంత్ర్యమును, మరికొందరు బ్రిటిషు సామ్రాజ్య అధినివేశ దేశములతో బాటు రాజ్యతంత్రమును కలిగియుండుటయు పర్యాయపదములుగా వాడుచు ఈ శబ్దమునకు పరిమితమగు అర్థమును కల్పించుచున్నారు. రాజ్యతంత్రధురీణుని యొక్క ముఖ్యవిధి జాతియొక్క నిర్మాణమునకు తగిన వసతులు సమకూర్చుట. ఇట్లాలోచించినచో భారతజాతియొక్క పరమావధిని పొందుటకు రాజ్యాంగస్వాతంత్ర్యము ఒక సాధనము మాత్రమే యగుచున్నది. కావున భారతీయులు వెంటనే నిర్వర్తింపవలసిన కార్యము మిక్కిలి గొప్పదిన్ని ఎక్కువ కష్టముతో కూడుకొన్నదియును నగుచున్నది. రాజ్యాంగ స్వాతంత్ర్యముగల దేశములలో జాతీయనిర్మాణమునకు వలయు ద్రవ్యము రాజ్యము యొక్క బొక్కసమునుండి వ్యయపెట్టబడును. మన కుండు దౌర్భాగ్యమువలన మన దేశమున అట్లు జరుగుట లేదు. మనము అవలంబించు కార్యవిధానములన్నియు స్వయంసహాయముమీద ఆధారపడవలసినవిగా యున్నవి. మన పురోభివృద్ధి దేశీయుల స్వయం సహాయముమీద ఆధారపడియున్నదను విషయము మన దేశప్రజలు పూర్తిగా గ్రహింపలేదు. మన శక్తులను మన ధనమును కట్టుబాట్లకు లోబరచి రాజ్యాంగమువారి సహాయము కోరకనే జాతీయాభివృద్ధికి కావలసిన ముఖ్యసాధనములను మనము సమకూర్చుకొనవలసి యున్నది.

మా యుద్యమము మిక్కిలి శైశవావస్థ యందున్నది. ఇందువలన కలిగెడు లాభములను ప్రజలు ఇంకను గుర్తెరుంగుటలేదు. మన పూర్వులు చేసిన మహాకార్యములను గూర్చి మనము పలుమారు చెప్పుకొనుట కేవలము వృథాడంబరమని ఇతరులు మనలను హాస్యము చేసిన చేయుదురుగాక! మన పూర్వులకు విద్యయందు గల పక్షపాతమును మనమెన్నడును మరువజాలము. కాశీ, తక్షశిలా, పాటలీపుత్రము మొదలగు ఉన్నతవిద్యాస్థానముల యందు గొప్ప గ్రంథాలయములు స్థాపింపబడి ప్రవృద్ధినొందుటతో పాటు ప్రతిదేవాలయమును ఆకాలమున ఒక విద్యాపీఠముగా విలసిల్లెను. గ్రీసు దేశములోవలె ప్రతిగ్రామమందును ప్రజలు తమపనులు తీరిన పిదప సమకూడి అన్యోన్య సహాయముచే తమజ్ఞానాభివృద్ధిని చేసుకొనుటకు తగినపరిస్థితులు అప్పటికాలమున ఉండియుండెను. చరిత్రాత్మకమగు విషయము నొకదానిని మీకు జ్ఞప్తికి దెచ్చుచున్నాను. గ్రీసు, రోము మొదలగు ఐరోపాదేశములందు వెలుగుచుండిన జ్ఞానజ్యోతి అంతరించి ఆ ఖండమంతయు అజ్ఞానతిమిరములో మునిగియున్నప్పుడు ఐరోపాదేశస్థులు జ్ఞానభిక్షకై యాచించినది తూర్పుదేశముల అప్పటికాలమున ప్రాచ్యపరిజ్ఞానమే — అందుముఖ్యముగా మహమ్మదీయ పరిజ్ఞానము — ఐరోపాఖండమునకు జ్ఞానదానముచేసి ఆ ఖండపు ఆధునిక చరిత్రకు శంకుస్థాపన చేసినది. కేవల శాస్త్రములు, కళలు, వాఙ్మయములందు మాత్రమునే గాక గ్రంథాలయ స్థాపనమునందు గూడ పాశ్చాత్యులకు ప్రాచ్యదేశస్థులు గురుస్థానము నలంకరించుచున్నారు. ఆధునిక పాశ్చాత్య గ్రంథాలయములు నిరుపమానమగు అప్పటి కాలపు మహమ్మదీయ ఖలీఫులచే స్థాపింపబడిన మహోన్నత గ్రంథాలయముల యొక్క అనుకరణములు కాదా! అయితే వర్తమాన కాలమున నిజమాడవలెనన్నను అభివృద్ధిపొందవలెనన్నను మనము పాశ్చాత్య దేశముల నేజ్ఞానజ్యోతికై మనదృష్టిని ప్రసరింప చేయవలసియున్నది. మనదేశీయులకు విద్యనభ్యసింప జేయు పద్ధతులయందును కట్టుబాటులయందును మనమెంతయో వెనుకబడియున్నాము. పరిస్థితులు మారినకొద్దీ పాశ్చాత్యదేశములందలి విద్యావిధానములు మారుచు మనలను ఆశ్చర్యనిమగ్నుల జేయుచున్నవి. ప్రజాసంఖ్య మిక్కిలి హెచ్చినది. ముద్రితగ్రంథములు తండోపతండములైనవి. రాకపోకలు అతి సులభములైనవి. దూరపుపట్టణములు కూడ దగ్గరకు వచ్చినట్లు కనబడుచున్నవి. పట్టణములకు పల్లెలకు సన్ని

హిత సంబంధమేర్పడినది. ఈ అన్ని కారణములచేతను ప్రాచీన విధానముల ననుసరించి మన దేశమున ప్రజాసామాన్యమునకు విద్యాభివృద్ధి జేయుటకు వీలుపడదు. ముఖ్యముగా మనము గమనించవలసిన విషయ మొకటి యున్నది. ఆధునిక పరిస్థితులయందు గురుశిష్య ధర్మము సంపూర్ణముగా నశించినది. ఇది సహజమైనది.

ఐరోపా ఖండమున స్వసహాయము వలననే విద్యోపార్జనము చేయు సాధనములు ప్రజాసామాన్యమునకు పౌరగ్రంథాలయముల మూలమున సమకూడుచున్నవి. ఇట్టిప్రతిష్ఠానము మనదేశమున లేని కారణమున అట్టి వసతులు మనప్రజలకు లభించుటలేదు. గ్రంథాలయములు కేవల గ్రంథములను భద్రపరచు స్థానములే కావు. అవి స్థాపింపబడియుండు పరిసరమంతయు జ్ఞానతేజముతో ప్రకాశింప జేయుబడును. కేవలగ్రంథమూలమున లభించు పాండిత్యమును కొందరు హాస్యము చేసినను "తన్నోపదేశము చేయు గ్రంథము సంయమీంద్రుల హృదయనాళమునుండి బయలు వెడలు రక్తమువంటిది. అవి ఉత్తర జన్మోపయోగము కొరకై నిక్షేపము చేయబడినవిగా నున్నవి" అని ఆంగ్ల కవిశేఖరుడగు "కౌపరు" మహాకవి చెప్పిన మాటలు మనకందరకు అనుభవ సిద్ధములేను. అయితే అసంఖ్యాకములగు గ్రంథములు ముద్రితములగుచున్న నవసత్పుస్తక విచక్షణా కార్యము కష్టసాధ్యమగుచున్నది.

మీయుద్యమము జయప్రదమగు గాతమని నేను సర్వేశ్వరుని ప్రార్థించుచున్నాను; మీ యుద్యమము మూలమున మనదేశమున గ్రంథాలయములు విరివిగా స్థాపింపబడును గాక! ఎవరును జ్ఞానవంతులు కాకుండ నిరోధించుటకు ఎవరికిని అధికారము లేదు. అట్లుగాక ప్రజాసామాన్యమందలి ప్రతివ్యక్తికిని జ్ఞానము సమకూడునట్లు సాధనవిధానమును నిర్మాణము చేయుట దేశాభివృద్ధిని గోరు ప్రతిభారతీయుని యొక్క ముఖ్య కర్తవ్యమై యున్నది.

అధ్యక్షులు వారి యుపన్యాసము ముగియగానే, ఇతరపనుల తొందరవలన వెళ్ళవలసియుండుటచేత వంగాలు స్వరాజ్యపార్టీ నాయకుడగు టి. సి. గోస్వామిగారిని అధ్యక్షులుగా నియమించి సభాభవనమును విడచిరి.

## కార్యనిర్వాహక సంఘాధ్యక్షుని నివేదిక.

అంతట అఖిలభారత గ్రంథాలయసంఘ కార్యనిర్వాహక సభాధ్యక్షులగు శ్రీ సూరి వేంకట నరసింహశాస్త్రి గారు ఈ క్రిందవివరించిన ప్రకారము కార్యనివేదికను సభ్యులకు వివరించి చెప్పిరి.

"మొదటి అఖిలభారత గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ" మద్రాసునందు జరిగినది. ఆసభవారు "అఖిల భారత గ్రంథాలయసంఘము"నకు నిబంధనల నేర్పరచుటకుగాను ఒక ఉపసంఘమును ఏర్పాటుజేసెను. ఆ ఉపసంఘమువారిచే ఏర్పాటుపబడిన నిబంధనలు కాకినాడయందు 1923 డిశంబరు నెలలో జరిగిన ద్వితీయ అఖిలభారత గ్రంథాలయ మహాసభయందు అంగీకరింపబడెను. మరియు ముందు వత్సరము జరుగవలసిన పని గూడ అప్పుడే నిర్ణయింపబడెను. అప్పుడు నిర్ణయింపబడిన కార్యక్రమము ఈక్రింద వివరింపబడినరీతిగా మూడు విధములుగా నున్నది.

(1) భారతవర్షమునందున్న ధర్మగ్రంథాలయముల యొక్క చరిత్రను తయారుజేయుట.

(2) రాష్ట్రీయ గ్రంథాలయ సంఘముల నేర్పరచుట.

(3) గ్రంథాలయోద్యమమునకుగాను ఆంగ్లేయ భాషయందు మూడు మాసముల కొకసారిపత్రికను ప్రకటించుట.

గ్రంథాలయచరిత్ర తయారు చేయుటకొరకు హిందూదేశమునందు మాకు తెలిసినంతవరకు గ్రంథాలయములకెల్ల ప్రశ్నల పత్రమును బంపితిమి. కాని ఇంతవరకు సుమారు 24 గ్రంథాలయములు మాత్రము వానిని పూర్తిజేసి పంపినవి. దేశమునందుగల గ్రంథాలయ నిర్వాహకులందరికిని వినతిపత్రము లంపబడినవి. ఈ తీరుగా గ్రంథాలయములయొక్క చరిత్రను తయారు జేయవలసిన ఆవశ్యకత అందరికిని తెలిసేయున్నది. అలహాబాదునందున్న పానినీ ఆఫీసువారు అయిదారు సంవత్సరముల క్రిందట గ్రంథాలయములయొక్కయు, శాస్త్రసంఘములయొక్కయు డైరక్టరీ నొకదానిని ప్రకటించినారు. కాని ఇటీవల దానిని తిరిగి ప్రకటింపలేదు. ఇంతేగాక, గ్రంథాలయములనుగూర్చి తెలియవలసిన విశేషములన్నియు అందు తెలుపబడియుండలేదు.

రాష్ట్రీయ సంఘములలో ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమును, [illegible] రాష్ట్ర సంఘమును ఈ సం

ఘమునకు శాఖాసంఘములుగా చేరినవి. పునహా నగర మందున్న మహారాష్ట్ర గ్రంథాలయసంఘము కొంత పనిజేసినది. కాని ఇప్పుడు సరిగా పనిజేయుటలేదు. తమిళరాష్ట్రమందును, వంగదేశమందును రాష్ట్రీయ సంఘముల స్థాపనకై గట్టి ప్రయత్నములే జరిగినవి. త్వరలోనే సంఘములు స్థాపనకాగలవు.

గ్రంథాలయములలో చాలభాగము దేశభాషల యందే నిర్వహింపబడుచుండుటచేతను రాష్ట్రీయ గ్రంథాలయ సంఘములు పనిచేయవలసిన విషయములలో దేశభాషాభివృద్ధియే ప్రాధాన్యత జెంది యుండుటచేతను భాషాప్రయుక్త రాష్ట్ర సంఘముల నిర్మాణమే ఈ సంఘనిబంధనల యందు ఏర్పరుపబడినది. ఈ రాష్ట్ర గ్రంథాలయసంఘములు ఏర్పడుటకు రెండు మార్గములు గలవు. ఒక రాష్ట్రమునందు ఇదివరకే పనిజేయుచున్న పలు గ్రంథాలయము లుండవచ్చును. అట్టిచోట్ల ఆగ్రంథాలయము లన్నియు సంయుక్త విధానము ననుసరించి రాష్ట్ర గ్రంథాలయ సంఘము ఏర్పరపవచ్చును. కొన్ని రాష్ట్రములందు గ్రంథాలయస్థాపనోద్దేశ్యమే వ్యాపన జేయవలసి యుండవలసి వచ్చును. అట్టిచోట్ల గ్రంథాలయోద్యమాభిలాషులను పనిచేయదగిన కార్యదీక్షాపరులను నగు కొందరిని చేర్చి ఆరాష్ట్రమునకు మధ్యస్థానమున రాష్ట్రీయ గ్రంథాలయ సంఘము నేర్పరుపవచ్చును. ఇట్లు నిర్మాణమైన సంఘము ఈ యుద్యమమును గూర్చి ముందుగా రాష్ట్రమునందు ప్రచారముసలిపి పిమ్మట గ్రంథాలయ సంఘముల స్థాపనకు పూనుకొనును.

ఈ రాష్ట్రీయసంఘములు చేయవలసిన పనులను ఈ క్రిందివిధముగ, మూడుభాగములుగా విభజింపవచ్చును. (1) ప్రచారణకార్యము (2) నిర్మాణకార్యము (3) సాంకేతిక భాగము.

ప్రచారణకార్యము సామాన్యముగా వార్తాపత్రికల మూలముననూ, సభల మూలముననూ జరుపవలసియుండును. మన యుద్యమముయొక్క స్వరూపస్వభావములను బట్టి మనము ఫలమును, దృష్టిని, విభ్రాంతి జెందించునట్టి విద్యుచ్ఛక్తి తీవ్రముతో చూపింపజాలము. అనుక్షణము మనము కృషిచేసినగాని మనకు ఫలము చేకూరదు. రాజధానీ నగరములందున్న మహత్తరములగు గ్రంథాలయాధికారులే ఈ యుద్యమముయొక్క సాంకేతిక భాగముకొరకు కృషిసల్పగలరు. జాగ్రత్తగా తయారుచేసిన గ్రంథవిభజన పట్టికలును గ్రంథవర్గీకరణములును లేకుండ వాఙ్మయము అభివృద్ధి చెందనేరదు. సర్వాంగసంపూర్ణమగు గ్రంథాలయము లున్నగాని ఇట్టి పట్టికలు తయారుచేయుటకు వీలుండదు.

పల్లెటూరు గ్రంథాలయములవలన కలిగెడు లాభములు అమితములు, అనంతములు. అవి కేవల గ్రంథనిక్షేపములే గావు. ఆధునిక భారతీయ గ్రంథాలయములు ప్రాచ్యపాశ్చాత్య సంస్థల ఉత్తమభాగములను ఏకత్ర సమావేశపరచి, మేళవింపజేసిన సంస్థలై యున్నవి.

పిమ్మట ఆంధ్రదేశమందలి గ్రంథాలయోద్యమమును గూర్చి సూక్ష్మముగా వివరించిరి. ఆంధ్రరాష్ట్ర గ్రంథాలయ సంఘముయొక్క కృషి సర్వతోముఖము. ఆసంఘమువారు విద్యార్థిదశను మించిన వయస్సుగలవారి ఉపయోగముకొరకై తాత్కాలిక పాఠశాలలను నిర్వహించిరి. ఇంకను ఎన్నియో దేశాభివృద్ధికరములైనట్టియు, భాషాభివృద్ధికరములైనట్టియు విధముల కృషి సల్పిరి. కడచిన మూడునాలుగు సంవత్సరములనుండియు భారతభూమి రక్తపాతరహితమైనట్టియు దౌర్జన్యరాహిత్యమైనట్టియు స్వరాజ్యసమరమున నిమగ్నమై యుండుటచే గ్రంథాలయోద్యమమువంటి సంస్థలు ఎక్కువ విజృంభించుటకు తగిన సావకాశము కలుగకపోయెను. ఇప్పుడు ప్రజలు మామూలుస్థితికి తిరిగి వచ్చిరి. దానశీలురగు లక్ష్మీపుత్రులు గ్రంథాలయములకు గొప్పదానములు చేయుచున్నారు. మొన్నమొన్ననే పేటపాలెంవాస్తవ్యులగు ఊటుకూరి వేంకట సుబ్బరాయశ్రేష్ఠి గారు రమారమి అయిదువేల రూపాయలు విలువగల భవనమును గ్రంథములను ప్రజాసామాన్యమున కర్పించి ధన్యులైరి. కార్యదీక్షాపరులగు దేశారాధకులు ఈ యుద్యమముకొరకై తమ జీవితమును వినియోగపరచుటకై ముందుకు వచ్చుచున్నారు. మన దేశము ప్రస్తుతము చీకాకుపరచుచున్న సమస్యలలో పెక్కింటిని సమాధానపరచుటకు గ్రంథాలయస్థాపన తగు సమర్థము కలిగి యున్నదని నొక్కి వక్కాణించుచు తమ యుపన్యాసము విరమించిరి.

## ఉపన్యాసములు

వారి యుపన్యాసమైన పిమ్మట వంగదేశమునుండి వచ్చిన కుమారి శీలకుమారీఘోషుగారు గ్రంథాలయముల ఆదర్శములను గూర్చి చక్కని యుపన్యాసమిచ్చిరి. ఆసం

తరువు మైసూరు సంస్థాన ప్రతినిధియగు వై. చంద్రశేఖర అయ్యరుగారు వారిరాష్ట్రమందలి గ్రంథాలయోద్యమమును గూర్చియు, పుదుక్కోట సంస్థాన ప్రతినిధియగు ఏ. ఎస్. ముద్దుకృష్ణగారు వారిసంస్థాన గ్రంథాలయోద్యమమును గూర్చియు వ్యాసములను జదివిరి.

## తీర్మానములు

అనంతరము ఈతీర్మానములు చేయబడినవి.

(1) హిందూదేశమందుగల వివిధగ్రంథాలయములును, గ్రంథాలయోద్యమాభిలాషులును, "భారత గ్రంథాలయ సంఘము"నందు సభ్యులుగా చేరి దేశమందంతటను అప్పుడప్పుడు జరుగు గ్రంథాలయ సభల పాల్గొనుచు, భారతగ్రంథాలయసంఘ కార్యదర్శికి వారిగ్రంథాలయములను గూర్చిన వివరములను రిపోర్టులను పంపవలసినదని ఈసంఘమువారు కోరుచున్నారు.

(2) ఒకటికంటె ఎక్కువ గ్రంథాలయములుగల రాజధానిపట్టణములందును తదితర ప్రధానస్థలములందును గల గ్రంథభాండాగారికు లందరును గలసి ఆయాపట్టణ గ్రంథాలయసంఘములను స్థాపించి, గ్రంథాలయశాస్త్ర విషయములను అభివృద్ధిలోనికితెచ్చి దేశమందు గ్రంథాలయ నిర్వహణమును అందరికిని తెలియునటులజేయుదురని ఈసభవారు కోరుచున్నారు.

(3) పాఠశాలలో విద్యనభ్యసించు వయస్సుమీరినవారు జ్ఞానాభివృద్ధి నొందించుకొను సాధనములు మనదేశమున ఇప్పటికాలమున లేకుండుట మిక్కిలి నష్టకరముగ నున్నదిగనుక అట్టికొరతను దీర్చుటకై గ్రంథాలయ సంఘములు అట్టి మీదుముదిరిన వారికి విద్యాభివృద్ధి నొందించుటకుతగు సమర్థమగు తాత్కాలిక పాఠశాలలను స్థాపించవలెననియు, అందుకుతగిన వాఙ్మయమును ప్రచురించవలెననియు, ఈసభవారు తీర్మానించుచున్నారు.

(4) అఖిలభారత గ్రంథాలయ సంఘము యొక్క పని సులభముగా నెరవేరుటకు ప్రతిరాజధాని యందును గ్రంథ భాండాగారికుల సభలను సమకూర్చి జాతీయ విద్య వ్యాపించుటకుగాను మార్గముల నన్వేషింపవలసినదని ఈసభవారు తీర్మానించుచున్నారు.

(5) జాతీయ పాఠశాలలందును కళాశాల లందును గల ఉపాధ్యాయులకును విద్యార్థులకును ఉపయోగముగానుండుటకై వివిధవిషయములను గూర్చిన గ్రంథముల యొక్క ప్రకటనను రాష్ట్రీయ గ్రంథాలయ సంఘములు చేయవలయునని ఈసభవారు తీర్మానించుచున్నారు.

(6) ప్రస్తుత దేశస్థితిగతుల ననుసరించి స్త్రీలకు ప్రత్యేకగ్రంథాలయములు అత్యంతావసరము గనుక అట్టి గ్రంథాలయములను స్థాపించుటకును లేదా ఉన్న గ్రంథాలయములలోనే స్త్రీలకు ప్రత్యేకశాఖలను ఏర్పరచుటకును వాటిని విరివిగా ప్రోత్సహించుటకును గ్రంథాల యోద్యమాభిలాషులను ఈ సభవారు కోరుచున్నారు.

## ముగింపు

తీర్మానములు ముగిసిన పిమ్మట అధ్యక్షత వహించిన గోస్వామిగారులేచి తమ అంత్యోపన్యాసమునందు దేశమును కలవరబెట్టుచున్న అనేక సమస్యలను పూర్తి జేయుటకు ఈ గ్రంథాలయోద్యమమే ప్రాముఖ్యతను వహించినదనియు అందుచేత భారతవర్షమునందంతటను ధర్మగ్రంథాలయ స్థాపనము విరివిగా సాగవలెననియు జెప్పి తమయుపన్యాసమును ముగించిరి. అంతట టంగుటూరు ప్రకాశంగారు అధ్యక్షునకు వందనము లర్పించిరి. అంతటితో సభముగిసినది.

# అఖిలభారత గ్రంథాలయ సంఘము

ఈసంఘముయొక్క సామాన్యసమావేశము 28-12-24 తేదీన బెల్గాంనందు విజయనగరశిబిరమున సమావేశమయ్యెను. అప్పుడు ఈ సంఘమునకు ఈ క్రిందిప్రకారము ఉద్యోగుల నెన్నుకొనిరి:—

. ఈ సభకు అధ్యక్షులగు దేశబంధు దాసుగారే ఈ సంఘమునకు అధ్యక్షులుగా నుందురు.

ఇదివరలో ఉన్న ఉపాధ్యక్షులకు అదనముగా శ్రీయుత టి. సి. గోస్వామిగారిని ఉపాధ్యక్షులుగా ఎన్నుకొనిరి.

అయ్యంకి వేంకట రమణయ్యగారిని తిరిగి జనరల్ కార్యదర్శిగా నెన్నుకొనిరి. కళా వేంకటరావుగారిని సంయుక్తకార్యదర్శిగా నెన్నుకొనిరి.

మూరి వేంకట నరసింహశాస్త్రిగారిని కార్యనిర్వాహక సంఘమునకు ఉపాధ్యక్షులుగా ఎన్నుకొనిరి.

సుశీల కుమారఘోషుగారిని వేరొక కార్యదర్శిగా నెన్నుకొని వారిని వంగదేశమందు ఈ యుద్యమమును వ్యాప్తము జేయవలసినదని కోరిరి.

ఈ సంఘాధ్యక్షునకు సహకారులుగా నుండుటగాను శ్రీయుత పి. డి. సర్కారుగారును, యస్. సి. ఘోషుగారును సహాయకార్యదర్శులుగా నెన్నుకొనబడిరి.

వీరు గాక కార్యనిర్వాహక సంఘసభ్యులు కూడ ఎన్నుకొనబడిరి.

1860 సం. 21 నెం. ఆక్టుక్రింద ఈ సంఘమును రిజిష్టరీ చేయుటకు తీర్మానించిరి

1924 సంవత్సరముయొక్క లెక్కలను ఆడిటుచేయుటకు ఆడిటరుగారగు చంద్రశేఖరరెడ్డిగారిని నియమించడమైనది.

# గ్రంథాలయములు

యన్నగూడెం తాలూకా ప్రజాసభకు అధ్యక్షులగు శ్రీ మాగంటి శీతయ్య యం. యల్. సి. గారు తమ అధ్యక్షకోపన్యాసమం దిట్లు జెప్పిరి.

ప్రతిగ్రామమునను ముఖ్యముగ నొకగ్రంథాలయముండవలెను. గ్రంథాలయములు గ్రామములయం దైక్యతను బోషించుటకు దోడ్పడగలవు. నిర్వ్యాపారతను దూర మొనర్పగలవు. గ్రామ్యజీవనమునకు వేలుపురుగువలె నున్న యైకమత్యరాహిత్యమునకు నిర్వ్యాపారత జననీ. పనిపాటులులేని సమయములయందే లేనిపోని వివాదములుపుట్టి యవి యనేక విధముల బెరిగి గ్రామముల నాశనము చేయుచున్న సంగతి మీరెఱుంగనిది కాదు. గ్రంథాలయమున్నచో సద్గ్రంథ పఠనముతో కాలక్షేప మొనర్చెదరు. వార్తాపత్రికలవలన దేశపరిస్థితుల నవగాహ మొనర్చుకొందురు. ఇతరదేశము లేయేతీరున సాంఘిక, ఆర్థికాది విషయములలో నభివృద్ధి బొందుచున్నవియు గ్రహించెదరు. తద్ద్వారమున నిర్వ్యాపారత దూరమై ఐకమత్యత యభివృద్ధియై తొల్లింటి గ్రామ్య జీవనమును జవిజూచెదరు. కావున ముఖ్యముగ ప్రతి గ్రామమున నొక గ్రంథాలయముండుట యవసరమని మఱల నొక్కి చెప్పుచున్నాను. ప్రతిగ్రామమునను శివకేశవాలయములు రెండును కనబడుచున్నవి. ఈయాలయములు లేని యూర కాలు బెట్టరాదని పూర్వులయభిప్రాయము. ఈకాలమున మనమంతయో పరిపెట్టుకొనక అందు గ్రంథాలయమునుగూడ జేర్చి ముఖ్యముగ మూడాలయములుండవలెనని నిర్ధరించవలసియున్నది.

# పోతన వేమనల యుగము

ఈ పొత్తము విజ్ఞాన చంద్రిక వారి "దక్షిణాఫ్రికా చరిత్ర" గ్రంథకర్తలగు శ్రీయుత దిగవల్లి వేంకట శివరావు బి. యే. బి. యల్ గారిచే రచింపఁబడి పవెల్ అండ్ మోర్ హెడు వారిచే బహూకరింపఁ బడినది. ఇందు పోతన వేమనల కాలము చక్కఁగ విశదీకరింపఁబడుటయేగాక ఆనాటి వాఙ్మయ మతస్థితులు స్ఫుటముగఁ దెలుపఁబడినవి. మఱియు పోతనగారి భాగవతములోని కథాచమత్కృతి, రసపోషణము, కవితావిశేషములు మొదలగునవి పోతనగారి పద్యరత్నములతో స్థాలీపులాక న్యాయమున చక్కఁగఁ జూపఁబడినవి. ఇంతియే గాక వేమనగారి నీతులు, లోకోక్తులు గల పద్యరత్నములు చాలవరకు మనోహరముగ వ్రాయబడినవి. వేమనగారి అంతరార్థబోధకమగు పద్యములు తుదిని కొన్ని వ్రాయబడినవి. మొత్తముమీద నీగ్రంథము చదువ కొలందిని రసవత్తరమై చదువరుల కాహ్లాదము గొలుపును. ఇటులే యింక యీ గ్రంథకర్తగారు గ్రంథావలోకనము గావించి మహాకవుల చరిత్రములు రచియించి ఆంధ్రభాషకమూల్యాలంకార మొనరింతురు గాక యని కోరుచున్నాము. ఆంధ్రభాషాభిమానులెల్లరు చదువదగియున్నది. వలయువారు;— బెజవాడలోని శ్రీ గ్రంథకర్తగారికి వ్రాసిన బడయగలరు. దీని వెల రు 0—8—0 లు మాత్రమే.

# భారతవర్షమునందలి ప్రాచీనసరస్వతీ భాండారములు

## ౩ సారస్వతరక్షణము

ప్రాచీనకాలమునందు విద్యనభ్యసించుపద్ధతి యిప్పటివలె నుండునది కాదు. ఆకాలమునందు గురువు ముఖస్థముగ శిష్యులు పాఠములను కంఠపాఠము జేయుచుండిరి. ఈవిధమున నేగ్రంథములనెల్ల కంఠపాఠము జేయుచుండిరి. వ్రాతప్రతులయందు స్ఖాలిత్యములుండుట సైజముగుటచేత ఆకాలమునందు శ్రుతిపాండిత్యమునే యెక్కువగ వృద్ధిపఱచిరి. ఇందుచేత విద్యార్థికి తానుజదివిన గ్రంథములెల్ల కంఠస్థములై పుస్తకాపేక్షలేకయే ఎప్పుడేనిసమయము కావలసినను సిద్ధముగ జ్ఞప్తియందుండుచుండెడివి. పుస్తకములను వ్రాసిజాగ్రతపఱచుకొనుట సామాన్యులకు సాధ్యముకాపనియగుటకూడ ఆకాలమునందు శ్రుతపాండిత్యమేయెక్కువ వ్యాప్తముగానుండుటకొక కారణమై యుండవచ్చును. ప్రాతిమోక్షమను కావ్యము బౌద్ధులకు మిక్కిలి పవిత్రమంతమైన కావ్యము. దీనిని ప్రతిమఠమందును నెలకొకసారి భిక్షులు చదువవలసియుందురు. ఏమఠమునందైన దీనిని కంఠపాఠముగా వల్లింపగల భిక్షులు లేనియెడల, తమకు సమీపముగానున్న మఠమునుండి దీనిని చింతనముచేసిన భిక్షువునిపిలిపించి వల్లింపవలయును. అంతేగాని గ్రంథమును దెప్పించుకొని చదువగూడదని నిర్ణయింపబడెను. భిక్షులు వర్షాకాలమునందు ప్రయాణము జేయగూడదను నియమముగలదు. కాని యేభిక్షువైన తనయవసానకాలమునందు తా నెఱిగియున్న సూత్రాంతముల నితరులకు జెప్పగలేని వాంఛించి, కోరినప్పుడు వా రీనియమమును మీఱవచ్చును. ఈ సంగతులనుబట్టి ఆకాలమందు శ్రుతపాండిత్యమున కెట్టి ప్రాధాన్య మీయబడెనో తెల్లముకాగలదు.

"ఫాహియాను" అను చీనాదేశ యాత్రికుడయిదవ శతాబ్ద ప్రారంభమునందు "వినయ" అను బౌద్ధమతగ్రంథసంపాదనార్థమై భారతవర్షమునకు వచ్చినప్పుడాయన కాగ్రంథముయొక్క వ్రాతప్రతు లెక్కడను దొరికియుండలేదట. గురువులు ముఖతఃమాత్రము పాఠములను జెప్పుచుండిరట.

## ౪ ప్రాచీనకాలమునందలి గ్రంథాలయములు

భారతవర్షమున ప్రథమమున గ్రంథభాండారముల నేర్పరచినది బౌద్ధులని చెప్పవచ్చును. "ఫాహియాను" సంస్కృతభాషను చదువుటకును, గ్రంథముల ప్రతులను వ్రాసికొనుటకును మూడుసంవత్సరముల కాలమును పాటలీపుత్రమందు గడిపియున్నాడు. మఱియు, మహాసాంఘికము. సర్వాస్తివాదము, సంయుక్తాభిధర్మహృదయశాస్త్రము, పరినిర్వాణవైపుల్య సూత్రము, మహాసాంఘికాభిధర్మము, అను గ్రంథములనుగూడ జూచెను. ఈ గ్రంథములకన్న ప్రాచీనములగు సంస్కృతగ్రంథముల వ్రాతప్రతులు మధ్యాసియాయందున్న బౌద్ధవిహారములయందు గానుపించినవి. కాని అయిదు, ఆరు ఏడు శతాబ్దములయందు బౌద్ధవిహారములు దేశమునందంతటను ప్రబలి, విద్యావ్యాసంగమునకును, వివిధములగు కళల యభివృద్ధికిని కారణభూతము లయ్యెను. అప్పుడే మహాయానపౌరాణిక బోధనలు ప్రాముఖ్యతను వచ్చి శాస్త్రము, వేదాంతము, మతము, మున్నగు విషయములనుగూర్చిన గ్రంథములు విశేషముగ ప్రబలినవి. ఆసియాఖండమునంతకును నల్కద విశ్వవిద్యాలయము మాత్రరాజమై వెలసినప్పటి నుండియు గ్రంథభాండారములకు ప్రత్యేకముగ గొప్ప భవనములు నిర్మింపబడుచుండెను. బౌద్ధజైన మఠము * లాయామత గ్రంథములకు నిలయములైన రీతినే గుప్తవంశ చక్రవర్తుల కాలమున దేశమందలి దేవాలయము లన్నియు సనాతన ధర్మగ్రంథములకు నిలయములయ్యెను. దేవాలయములు మొదలగువానికి గ్రంథములను దానము చేయుట పరమోత్కృష్టమగు కార్యమని హేమాద్రి తనదానఖండమందు ♦ జెప్పియున్నాడు. పౌరాణిక మతానుసారులేగాక బౌద్ధజైన మతావలంబకులు గూడ దీనిని ఘనకార్యము క్రింద పరిగణించిరి. ? ఈకాలము నాటి శాసనములుకూడ గ్రంథములను దానమిచ్చుట యందుగల ప్రాశస్త్యము నుద్ఘోషించుచున్నవి.

---

* వీనిని విహారము లనియు సంఘారామము లనియు ఉపాశ్రయము లనియు మఠము లనియు బిలిచెదరు.

♦ Referred to in Buhlers Indian Paleography P. 99

?Crasastis of the old Manuscripts.

పశ్చిమ హిందూదేశము నేలిన వలాభిరాజులచే వ్రాయబడినట్టి క్రీ. శ. ౫౬౭ సంవత్సరము నాటిదగు నొక శాసనమునందు, బౌద్ధభిక్షులదగు దుద్ధమఠము యొక్కయు ఉపయోగార్థమై సద్ధర్మ పుస్తకములను గొనుటకై వరాశము నొకరిచ్చినటుల జెప్పఁబడినది. ఇప్పటికినిగూడ జైనులలో ధనవంతులు గ్రంథప్రతులను వ్రాయించుటకును, పవిత్రగ్రంథముల నభివృద్ధిపఱచుటకును మతాధికారులకు విశేషద్రవ్యము నొసంగెదరు. అందుచేత పశ్చిమ హిందూదేశమున జైనగ్రంథాలయములయందు ఒకే గ్రంథమునకు వందలకొలఁది ప్రతులు గూడ నేర్పడినవి. "అహమ్మదాబాదు"నందున్న ఒక గ్రంథాగారమునందు "అవశ్యక సూత్రములు" అను జైనగ్రంథము యొక్క నాలుగువందల వ్రాతప్రతులుఁ గలవు.

## ౫ మూడు విధములగు గ్రంథాలయములు.

బౌద్ధ, జైన మతములయందుగల గ్రంథాలయములను గూర్చియు, హిందువుల దేవాలయములయందుగల గ్రంథాలయములను గురించియు నింతవరకు జెప్పితిమి. ఈ రెండును ద్వివిధములగు పరిజ్ఞానములకు నిలయములై యొప్పియున్నవి. కాని కాలక్రమమున చక్రవర్తుల పోషణచే లౌకిక సారస్వతము అభివృద్ధియైన కొలదిని రాజభవనములును, సభామండపములునుగూడ గ్రంథభాండారములకు నిలయములయ్యెను. నేటికిని యీ త్రివిధములగు గ్రంథభాండారములకును దృష్టాంతములు నిలిచియేయున్నవి. ఇట్లు నిలచియున్నవానిలో మొదటి తరగతివగు పశ్చిమ హిందూదేశమునందలి జైన భాండారములును, వివిధమతములయందున్న గ్రంథాలయములును తంజావూరు, కాశ్మీరము, నేపాలు, మైసూరు రాజభవనములయందున్న గ్రంథభాండారములును, రాజపుత్ర సభామండపములయందున్న గ్రంథభాండారములును ముఖ్యములైనవిగ నున్నవి.

## ౬ ప్రసిద్ధములగు బౌద్ధగ్రంథాగారములు.

బౌద్ధమతభిక్షులకు సంబంధించిన ప్రాచీన గ్రంథాలయములకెల్ల పెద్దదియు, ప్రఖ్యాతివంతమైనదియు నగు గ్రంథాలయము "నలంద" గ్రంథాగారమైయున్నది. భారతవర్షమున ప్రాచీనకాలమునందు గల విశ్వవిద్యాలయములయందెల్ల యీ గ్రంథాగారమే అగ్రస్థానమును వహించియున్నది; ఈ గ్రంథాగారము రత్నోదధియను నామముచే విఖ్యాతవంతంబగు తొమ్మిదియంతస్థులుగల దేవాలయమునందు పెట్టబడియుండెను. "బుద్ధగయ" యందు గల తొమ్మిదియంతస్థుల దేవాలయమునే యిదియు పోలియుండెను. ఈ గ్రంథాగారము మహాయన హీనయన బౌద్ధగ్రంథములకెల్ల రక్షకస్థలమని చెప్పనొప్పును. ఈ గ్రంథములయందెల్ల "ప్రజ్ఞాపరిమితసూత్రము" "సమాజగుహ్యసూత్రము" అను తాంత్రికగ్రంథములు ప్రాధాన్యములు. ఈ గ్రంథాగారమునందలి గ్రంథములన్నియు యేమయ్యెనో చెప్పుటకాధారములేమియు లేవు. కాని ఈమఠమునందున్న క్రొత్త శిష్యుడొకనివలన అవమానింపఁబడి తీర్థికభిక్షుడొకడు దీనిని తగులఁబెట్టెనని టిబెతుదేశమునందు ప్రచారమునందున్న ఒక కథ వలన తెలియుచున్నది. దైవవశముచే బౌద్ధమత గ్రంథములన్నియు అందు తగులబడకుండ రక్షింపబడెననికూడ ఆకథయందే చెప్పఁబడియున్నది. ఈసంగతి ఎనిమిదవ శతాబ్దమునందు జరిగినటుల దోచుచున్నది. ఏడవశతాబ్దమునందు నలందవిశ్వవిద్యాలయము ఉచ్ఛదశయందున్నప్పుడు మన దేశమునకు చీనాదేశస్థుఁడగు హ్యానిత్సాంగు అను యాత్రికుఁడు విచ్చేసెను. † ఆయన గ్రంథములయొక్క వ్రాతప్రతులను విలువగల యితర వస్తువులనమేకముగ సంపాదించెను. కాని దొంగలుదోచుకొనుటచేతను, ప్రమాదవశముపలనను, అనేకసారులు వానినన్నిటిని గోలుపోయెను. అయినను తుదకు బుద్ధునియస్థికలయొక్క ఏబది శకలములను, వెండి బంగారులతోడను చందనముతోడను చేయఁబడిన బుద్ధునిప్రతిమలను, ఇరువది గుఱ్ఱములమీద వైచి ౬౫౭ వ్రాతపుస్తకములను దనదేశమునకుఁ గొనిపోగలిగెను. తన దేశమునకు పోయిన పిమ్మట, ఆయన తన జీవితశేషమంతయు భాషాంతరీకరణమునందే గడపెను. అందుచేత ౬౬౧ సంవత్సరమునందాయన తన సారస్వత పరిశ్రమను ముగించునప్పటికి వివిధములగు డెబ్బదినాలుగు గ్రంథములు చీనాభాషలోనికిఁ దేఁగలిగెను. భారతవర్షముయొక్క విజ్ఞానైశ్వర్యము చీనా, జపాను, కొరియా మున్నగు దేశముల

† Early History of India by Mr. Vincent Smith P. 3.

కొనిపోగలిగిన మహాత్ములయందీయన యొకరు. ఈకారణముచేతనే మహాయాన బౌద్ధసిద్ధాంతములను గూర్చిన ప్రాచీన సంస్కృత గ్రంథము లనేకములు జన్మస్థానమగు భారతవర్షమునందు లభ్యము గాకున్నను, వాని భాషాంతరీకరణములు మాత్రము చీనా, జపాను దేశముల యందుగల దేవాలయ గ్రంథభాండాగారముల యందు సురక్షితముగా నున్నవి.

"నలంద" విశ్వవిద్యాలయము యొక్క ప్రాముఖ్యత క్షీణించుటకు ప్రారంభించినప్పుడే మగధ రాజ్యము నేలుచుండిన "పల" రాజుల యాదరణక్రింద "ఉదంతపురి" యందును "విక్రమశిల" యందును రెండు విశ్వవిద్యాలయములు బయలుదేరెను. ఈరెండు విశ్వవిద్యాలయములకును ననబంధముగ మిక్కిలి ప్రాముఖ్యతం జెందిన రెండు గొప్పగ్రంథాలయములు గలవు. నలంద, ఉదంతపురి, విక్రమశిల గ్రంథాగారములనుండియే అసంఖ్యాకములగు గ్రంథరాజములను దీసికొనిపోయి తమ భాషను టిబెత్తు దేశీయులు ఐశ్వర్యవంతముగం జేసికొనిరి. గ్రంథాగారముంచబడిన ఉదంతపురి విహారము "నలంద" "బుద్ధగయల" యందున్న విహారముల కంటె మహత్తరమైనదని చెప్పెదరు. ఈ యుదంతపురి గ్రంథాగారమునందు బౌద్ధమత సంబంధములును సనాతన మతసంబంధములును నగు గ్రంథములు అసంఖ్యాకముగ నుండెను. ౧౨౦౨ క్రీ. శ. సంవత్సరమునందు బీహారు దేశమును భక్తియారు ఖిల్జీ జయించినప్పుడు వాని సేనానియగు "మహమ్మదు బిన్ శిపి" చే నీ గొప్పగ్రంథాగారము తగులబెట్టబడెను.

ఉత్తరహిందూస్థానమందున్న విహారములలో చాల భాగము ప్రథమమున మనదేశమునకు వచ్చిన మహమ్మదీయులవలననే నిర్మూలము గావింపబడినది. అందుచేత భిక్షులు తాము మోయగలిగినన్ని మత గ్రంథములను దీసికొని "నేపాలు" దేశమునకు పారిపోయిరి. టిబెత్తుదేశమునను హిందూదేశమునకంటెను నేపాలుదేశమునందును మాత్రమే బౌద్ధమతమునకు సంబంధించిన సంస్కృతగ్రంథములలో కొన్నియైన దొరకినవి. ఈభాగములను మిక్కిలి శ్రద్ధతో పరిశీలించిన బౌద్ధమతమును గూర్చిన అమూల్యములగు విషయములను బోధింపగల అపూర్వ గ్రంథములింకను బయలు వెడల వచ్చును. నేపాలు దేశమునకు భిక్షులచేం గొనిపోంబడిన అమూల్యములగు గ్రంథరాజములను గొన్నిటిని మనప్రభుత్వము వారిచే నియోజితులగు మంత్రులు సంపాదించి ఇగ్లాండునకు గొనిపోయిరి. ఇదిచాలక ఆదేశమునకు మంత్రియగు మహారాజ-చంద్రషంషీరుజంగు బహద్దరుగారు ౧౯౦౯ సంవత్సరమున అక్సుఫోర్డు నగరమునందలి బోడ్లియను గ్రంథాలయమునకు ౬౩౩౦ సంస్కృత లిఖిత గ్రంథములను ఉచితముగ నొసంగి మనదేశమునకు యథార్థమగు దారిద్ర్యమును దెచ్చెను. మనదేశమునకున్న యైశ్వర్యమే సారస్వతైశ్వర్యము. ఎంత వెండిపోయినను బంగారమెంత పోయినను దిగులు పడవలసిన పనిలేదు. కాని యీ విజ్ఞానైశ్వర్యనష్టముయొక్క పరిమితి యందు కొంతభాగమునైనను గూడదీయగల వారెవ్వరును లేరు. ఖిలమయిపోవుచున్న యథర్వణవేదము యొక్క వ్రాతప్రతి నొకదానిని అస్ట్రియాదేశమునకు దీసికొనిపోయి దాని పుటలన్నిటికిని ఫొటోగ్రాఫులను దీసియుంచిరి. ఆ ఫొటోగ్రాఫులన్ను మైసూరునందున్న గ్రంథాలయమునందు మన మిప్పుడు చూడగలము.

## ౨. జైనగ్రంథాలయములు

బౌద్ధగ్రంథాలయములు నశించినప్పటికిని వానిస్థానమును జైనగ్రంథాలయములాక్రమించుకొనినవి. బౌద్ధమతమువలెనే జైనమతమును భారతవర్షమునందింకను జీవించియే యున్నది. రాజపుత్రస్థానము, గుజరాతు, పతాను, జసల్మీరు, సూరతు, కాంబే, అహమ్మదాబాదు మున్నగుపట్టణములయందనేక జైన ఉపాశ్రయములున్నవి. వీనియన్నింటికిని గూడ జైనులయొక్క మతముచరిత్రములను తెలియజేయునట్టి ముఖ్యగ్రంథములు గలిగిన గ్రంథాగారములు గలవు. వీనికి "భారతీభాండారము" లని పేరు. జైనభాండారములయందు ప్రాముఖ్యములగున వన్నియు దక్షిణహిందూస్థానమునందే గలవు. వీనిలో పతాను * అహమ్మదాబాదు, వద్వాను, సూరతు,

* ఇది బరోడారాజ్యమునందున్నది. [illegible]

కాంబే, తరాదు, జసల్మీరు, ఖట్నీరు నగరములందు గల గ్రంథాగారములందు ప్రతిదానియందును పదివేల వ్రాత ప్రతులుకలవు. పూర్వకాలమున 'అన్హిల్ వాడ' అను పేరు గల "సిద్ధాపురపటాను" అనునది పదునొకొండు పన్నెండు శతాబ్దములయందువలె నేటికిని జైనమతమునకు ఆటపట్టయియున్నది. అచటి యుపాశ్రయములయందు 'శ్రావకు'లని పిలువఁబడు యతులు చాలమంది నివసించెదరు. ప్రతి యుపాశ్రయమునందును మతగ్రంథముల వ్రాతప్రతులు కొన్ని భద్రపరుపబడియుండును. కాలము జరిగిన కొలఁదిని గ్రంథముల సంఖ్యయు, ప్రాముఖ్యతయు కూడ హెచ్చుచుండును. పటాను నగరమునందు పదకొండు నెక్కువ ఉపాశ్రయములుగలవు. వీనిలోఁగొన్ని చాళుక్యరాజుల కాలమున ప్రారంభింపబడినవై యున్నవి. అందుచేత ౧౨, ౧౩ శతాబ్దముల గ్రంథములు మనకచట లభ్యమగును. వీనియందు గ్రంథములు అట్టలపెట్టెలయందు భద్రము చేయబడినవి. ఒక్కొక్క పెట్టెయందు పది మొదలు పదునైదువరకు వ్రాతగ్రంథములుండును. వీనిని యతులు తెఱచుచుఁ దీసి చదివి వినిపించుచుందురు. అందుచే నివి గాలి పోసికొని చెడిపోక నిలచియున్నవి. జైనమతములయం దెల్లెడలను వ్రాత గ్రంథములను మిక్కిలి శ్రద్ధాభక్తులతో కాపాడుచుండిరి. జైన, బౌద్ధ, శైవ, వైష్ణవ గ్రంథాలయములన్నిటియందును గ్రంథముల ప్రతులను వ్రాయు పనిని యతులే నిర్వహించుచుండిరి. లిపియందు వీరి సామర్థ్యము నిరుపమానము. అందుచేత నేపాళదేశ ప్రభువుయొక్క గ్రంథాగారమునకు వ్రాతప్రతులను తయారుచేయుటకై వీరినే నియోగించిరి. † "పటాను" పట్టణమునందున్న గ్రంథాలయములలోకెల్ల, [illegible] పది పెట్టెల వ్రాతప్రతులుగల హేమచంద్ర భాండారము, ౧౨౦౦ ల వ్రాత ప్రతులుగల తపాగచ్ఛభాండారము, ౫౦౦ తాటియాకుల గ్రంథములుగల సంఘవిపాడన గ్రంథాగారమును మిక్కిలి ప్రాముఖ్యములై యున్నవి. ఈ సంఘవిపాడన గ్రంథాగారమునందు జైనమతమునకు సంబంధించిన గ్రంథములన్నియు, వాని భాష్యములు, చూర్ణికలు, వృత్తులు సహితముగాఁ గలవు. జైనమతమును సారస్వతమునుగూర్చిన పరిశీలనలను జేయుటకును, గుజరాతుదేశచరిత్రకు సంబంధించిన ఆధారములను సంపాదించుటకును యీ గ్రంథములు అమూల్యములై యున్నవి.

ఈ గ్రంథాగారమునకు పిమ్మట జసల్మీరు నందున్న పరశనాథ దేవాలయమందలి భాండారము గొప్పది. దీనియందపూర్వములగు కొన్ని జైనమతగ్రంథములే గాక, పన్నెండు, పదమూడు, పదినాల్గు శతాబ్దముల యందు వ్రాయబడినట్టి సంస్కృతసాహిత్య కావ్యములును, వైదికగ్రంథములును అనేకముగా కలవు. బిల్హణ విరచితమగు విక్రమాంకచరిత్రమును, * జలంధరు వాస్తవ్యులగు ఉపేంద్రవార్ష్ణ పాలకుడు రచించిన యశోవర్మ విజయము ◆ ను నిచటనే ప్రథమమున సంపాదింపబడినవి. ఈ సంగతులనుబట్టి యీ గ్రంథాగారములందు మత గ్రంథములనేగాక, లౌకిక విషయకములగు గ్రంథములను కూడ స్వీకరించి పెట్టినవారని స్పష్టమగుచున్నది.

పశ్చిమ సముద్రతీరమునందు కనరాజిల్లాలో "మూడబిద్రి" అను గ్రామమునందు జైనమఠమొకటి కలదు. అందు గొప్ప వ్రాతప్రతుల భాండారమొకటి గలదు. అనేక పూర్వగ్రంథము లిక్కడ కననగును. మైసూరు సంస్థానమునందున్న "శ్రమణబెల్గోలా" అను ప్రదేశము జైనమతమునకొక ప్రధానస్థానము. మౌర్యవంశ్యుడగు చంద్రగుప్తుఁడీ గ్రంథాగారమును దర్శించెనని చెప్పుదురు. ఇచటఁగల కొండమీఁద ౭౦ అడుగుల యెత్తుగల నల్లరాతిబండమీఁద చెక్కఁబడిన "గొంతేశ్వరు" ని విగ్రహమొకటి గలదు. క్రీ. శ. తొమ్మిదవ శతాబ్దమున "చాముండిరాజు" చే నిది నిర్మింపఁబడియున్నది. ఈ కొండక్రిందనున్న జైనుల విహారమునందు మంచి స్థితియందున్న గొప్ప గ్రంథాగారము గలదు. ఈ గ్రంథములలో చాలభాగము తాటియాకులమీద పాళి, సంస్కృతము, కన్నడము, అరవభాషయందు వ్రాయఁబడియున్నవి. మైసూరు రాజ్యమునందే "హుంచ" జైనవిహారమునందొక సామాన్యమైన గ్రంథాగారము గలదు. ఇంతేగాక విశేషముగ వ్రాఁతప్రతులను సంపాదించి భద్రముగ కాపాడుచున్న జైనసంఘము లనేకములిప్పటికిని పశ్చిమహిందూదేశమునందు గలవు.

---

† Catalogue of Durbar Library of Nepal by Mahamahopadhyaya Haraprasad Sastri.

* [illegible] దేశము నేలినట్టి [illegible] రాజగు [illegible] చరిత్రము.

3



## ౮ సభామంటపములు-గ్రంథాగారములు.

పవిత్ర్యములకు నిలయములగు విహారములు, ఉపాశ్రయములు, మఠములతోఁబాటు రాజుల సభామంటపములు గూడ గ్రంథభాండారములకెట్లు నిలయములగుచున్నవో, ఇదివరకే చెప్పఁబడినవి. ఈసభామంటప గ్రంథాగారములయందు లౌకికవిషయములను గూర్చినట్టియు, శిల్పకళలకు సంబంధించినట్టియు గ్రంథములు విశేషముగ సేకరింపఁబడుచుండెను. నాలుగవ శతాబ్దమునుండియు వ్రాయఁబడుచున్న శాసనము * లనుబట్టి చూచిన, ఆకాలమున రాజులు కవులను విద్వాంసులను విశేషముగ నాదరించుచుండినటులఁ గన్పట్టుచున్నది. కాని పదునొకండవ శతాబ్దమందేలిన భోజమహారాజుయొక్క గ్రంథాగారమునకు‡ పూర్వముండి సభామంటప గ్రంథాగారములను గూర్చిన ప్రశంస మనకెచ్చటను గానుపించుట లేదు. మధ్యకాలమునందు రాజులచే పోషింపఁబడిన గ్రంథభాండారములకెల్ల నిదియే మేటియని చెప్పవచ్చును. ౧౧౪౦ సంవత్సరప్రాంతమునందు "సిద్ధరాజ జయసింహుడు" మాళవదేశమును జయించి, ఈగ్రంథభాండారమును అన్హిల్ వాడునకు తీసికొనిపోయి అచటనుండినట్టి చాళుక్యగ్రంథభాండాగారముతో కలిపివైచెను. చాళుక్యరాజుల భారతీ భాండారమునుండి† సంపాదింపఁబడిన నైషధీయ ప్రతికే విద్యాధరుఁడు ప్రథమభాష్యమును రచియించెను. మరియు "కావ్యాలము"ల నీ భాండారమునుండియే కైకొని, యశోధరుడు జయమంగళ టీకను రచియించెను. పైన జెప్పఁబడిన చాళుక్యరాజుల భారతీ భాండారమునందున్న రామాయణ ప్రతినుండియే జర్మనీ దేశమునందు "బాన్" పట్టణమునఁగల విశ్వవిద్యాలయమువారు స్వీకరించిన రామాయణ ప్రతి వ్రాయబడినది.

మన ప్రభుత్వమువారు చేసిన వ్రాత ప్రతుల పరిశోధన వలన అల్వారు, బికనీరు, జమ్ము, నీపాలు, మైసూరు తంజావూరు లందుగల ఆస్థాన గ్రంథాగారములు బయలుపడి మిక్కిలి యుపయోగకారులయ్యెను. ఉత్తర హిందూస్థానమునందలి రాజులలో అనేకమందిని మహమ్మదీయులు వశపఱచుకొనియున్నను రాజపుత్రస్థానము నీపాలు ఒరిస్సా దేశప్రభువులును దక్షిణ హిందూస్థానమునందలి ప్రభువులును తమస్వాతంత్ర్యమును నిలుపుకొని భోజమహారాజువలె కవులను పండితులను ఆదరించి మనవిజ్ఞానమడుగంటకుండఁ జేసిరి. రాజపుత్రస్థానము, నీపాలు, కాశ్మీరము, తంజావూరు ఆస్థానముల యందుగల గ్రంథ భాండారములలో సంస్కృతమునందును యితర దేశభాషలందును గల అనేక వ్రాత ప్రతులను నేటికిని మనము చూచుచున్నారము. పదునెనిమిదవ శతాబ్ద ప్రారంభమునందు అంబరు రాజ్యము నధిష్ఠించిన సవాయి జయసింగు మహారాజు విజ్ఞానవ్యాప్తికై మిక్కిలి పాటుపడెను. ఆయన జయపురము × ను నిర్మించి కళలను శాస్త్రములను బోషించెను. వీధులన్నియు ఒకదానినొకటి సమకోణములయందు సమభాగములుగ భాగించునటుల సరియైన పద్ధతిప్రకారము కట్టబడిన పట్టణము జయపురముతప్ప వేరెద్దియు లేదు. విద్యాధరుఁడను నామముగల వంగదేశజుఁడొకఁడీరాజావర్గమునుండెను. రాజుచేయు శాస్త్రవిషయిక ఉద్యమములన్నిటియందతఁడు సహాయకారియై సమర్థతతో నెఱవేర్చుచుండెడివాఁడు. ఆయనసహాయమును ఢిల్లీ, జయపూరు, ఉజ్జయిని వారణాసి, మధురాపట్టణములయందీరాజు నక్షత్రములను చూచుటకు పలయుసాధనములతో నమర్చబడిన మందిరములను గట్టించెను. ఆమందిరములయందుపయోగింపఁబడిన పరికరములన్నియు ఆయనచే స్వయముగ కనిపెట్టఁబడినవి. అందుచే చేయబడినపరిశోధనలు గొప్పపండితులకుగూడ ఆశ్చర్యమును గొల్పినవి. † ఆయన రేఖాగణితశాస్త్రమును, త్రికోణశాస్త్రమును, సంవత్సరమానమును సంస్కృతమునందు వ్రాయించెను, మనదేశదురదృష్టవశముచేత నీజయసింగుమహారాజు స్త్రీలోలుడైతన రాజ్యమును

* వీనిని శాసనములనెదరు.

‡ Buhler's Indian Paleography p. 99

† ఈ రాజులపేర్లు విశాలదేవుడు, విశ్వమల్లుడు (క్రీ. శ, ౧౨౪౩-౧౨౬౨)

× రాజపుత్రస్థానమందున్నది.

గ్రంథ భాండారమునుగూడ గోలుపోయెను. మిగిలిన గ్రంథములు కొన్ని ఇప్పటికిని జయపురమునందు, శ్రోత్రియ బ్రాహ్మణులయధీనమునం దున్నవి.

జోధపురము, బికనీరు, అల్వారు మహారాజుల గ్రంథ భాండారములు గూడ మిక్కిలి ప్రఖ్యాతివంతములైనవి. జోధపురి గ్రంథాగారమునందు ౧౮౦౦ సంస్కృత వ్రాతపతులును ముద్రితములగు సంస్కృతగ్రంథము లనేకములు కలవు. ఇంతేగాక దేశభాషలయందు వ్రాయబడిన గ్రంథము లనేకవందలు కలవు. ఈ గ్రంథాగారము నందున్న వానిలో పురాణములు, మాహాత్మ్యములు, తాంత్రిక గ్రంథములు ఎక్కువ కలవు. బికనీరు మహారాజుయొక్క గ్రంథాగారమునందు ౭౦౦౦ సంస్కృత వ్రాతపతులు గలవు. అనేక శతాబ్దములనుండి కాశ్మీర దేశము విద్యాధిదేవతకు ప్రీతిగల స్థానమై యున్నది. ఆదేశమునం దిప్పటికిని సరస్వతీదేవి తనప్రభుత్వమును నిరంకుశముగ సాగించుచున్నదని మనపండితుల నమ్మకము. రాజతరంగిణియను సంస్కృత గ్రంథమునందు జెప్పబడిన అనేకమంది కాశ్మీర దేశ కవుల గ్రంథము లింకను కానరాకున్నవి. కావ్యములేగాక, శాస్త్రములు — అందు ముఖ్యముగా వ్యాకరణశాస్త్రము, అలంకారశాస్త్రములు ఈదేశమునం దనేకవందల సంవత్సరముల నుండియు అభ్యసింపబడుచున్నవి. అథర్వణవేద మధ్యయనము జేసిన పండితులనేకమంది యిప్పటికిని యీదేశమునందు మాత్రమే కలరు. చరిత్రాత్మకమగు "రాజతరంగిణి" యను సుప్రసిద్ధగ్రంథము ఇచటనే దొరకినది. ఈదేశప్రభువులు మన సారస్వతైశ్వర్యమును గుర్తెరింగి నేటికిని దాని పోషణమునకై సర్వవిధముల దోడ్పడుచున్నారు. ఈరాజు తన ఆస్థానమునం దనేకపండితుల నంపించి దేశముయొక్క పలుస్థలములందుగల సంస్కృత వ్రాతపతుల ప్రతులను వ్రాయించి తెప్పించి తనగ్రంథాగారమునందుంచుచున్నాడు. ఈరాజుయొక్క గ్రంథాగారము "జుమ్మూ" పట్టణమునం దున్నది.

ఈరాజు వారణాసిపురమునందు కొందఱు పండితుల నుంచి, ప్రాచీనములగు వ్రాతప్రతులు అమ్మకమునకు వచ్చినప్పుడెల్ల వానిని క్రయమునకు దీసికొని, యిప్పటికిని తన భాండారము నభివృద్ధి జేయుచుండును. కాశ్మీర దేశమునందు వ్రాయబడిన వ్రాతప్రతులన్నియు మిక్కిలి సొంపుగ నుండును. అవి పుష్పలతాదులతోడను విపరీతములగు సంకేతాక్షరములతోడను, అంచులయందు పట్టీలతోడను చిత్రాత్మకములగు బొమ్మలతోడను అలంకరింపబడి తోలుతో బైండు చేయబడియుండును. వానిని ఈకాలపు గ్రంథాలయములయందువలెనే బీరువాలయందు భద్రముగ నుంచెదరు.

ఉత్తర హిందూస్థానమందెల్ల ప్రాచీనతచేతనేమి, ప్రాముఖ్యతచేతనేమి, వన్నెకెక్కియున్న గ్రంథభాండారము నీపాళదర్బారునందు గలదు. గుప్త ప్రభువుల కాలమునాటి వ్రాతప్రతులు గలవు. బౌద్ధమతమునకును, వైదికమతమునకును గూడ నీపాళదేశమునం దాశ్రయము గలదు. మహమ్మదీయులు దేవాలయములను మఠములను గ్రంథాగారములను తగులబెట్ట జొచ్చినప్పుడు, జనులు చేతనైనంతవఱకు అమూల్యగ్రంథము లనేకములను యీ దేశమునకు గొనిపోయిరి. అందుచేతనే అతిప్రాచీనములగు అపూర్వ గ్రంథములనేకములు యీ దేశమునందు దొరకినవి. ఈ గ్రంథాగారమునందు కాకితముల మీదను తాటియాకుల మీదను వ్రాయబడిన ౫౦౦౦ ల వ్రాతప్రతులు గలవు. ఈ రాజ్యము నేలిన ప్రభువులెల్ల దీని నభివృద్ధిపఱచుటకు సదా పాటుపడుచున్నారు. ఈ దేశశీతోష్ణస్థితి వ్రాతప్రతులు చెడిపోకుండ నుండుటకు మిక్కిలి సహాయభూతముగ నున్నది.

దక్షిణ హిందూదేశమున, తంజావూరు రాజుల గ్రంథభాండారమును, మైసూరునందున్న సరస్వతీ భాండారమును దక్షిణహిందూదేశమున ప్రాముఖ్యములై యున్నవి. వీనియందు తంజావూరు గ్రంథాగారము మిక్కిలి ముఖ్యమైనది. ప్రపంచమునందంతటను తంజావూరు గ్రంథాలయము గొప్పదియు, ప్రాముఖ్యమైనదియు నని* బర్నెలు దొరగారు చెప్పియున్నారు. తంజావూరును తెలుగు నాయకప్రభువు లేలుచున్నప్పుడు పదునారవ శతాబ్దాంత్యముననో, పదునేడవ శతాబ్ద ప్రారంభముననో ఈ గ్రంథాగారము ప్రారంభింపబడినది. ప్రథమమునం దారాజులు తెలుగులిపియందు వ్రాయబడిన సంస్కృత గ్రంథములను సంపాదింప నారంభించిరి.

పదునెనిమిదవ శతాబ్దమునం దీదేశము మహారాష్ట్రులు జయించిరి. అప్పటినుండియు గ్రంథసంపాదన

15



యందశ్రద్ధ ప్రబలెను. ఇప్పుడు గ్రంథాగారమునం దున్న సంస్కృతవ్రాతప్రతులలో చాలభాగము శరభోజ మహారాజు వారణాసీపురమునకుబోయినప్పుడు (౧౮౨౦-౩౦) సంపాదింపబడినవియే యైయున్నవి. దేవనాగరి, నందినాగరి, తెనుఁగు, కన్నడము, గ్రంథి, మళయాళము, బంగాళము, పంజాబీ, కాశ్మీరము, ఓఢ్రము, అరవము, అను పదునొకండు భాషలలో వ్రాయబడిన ౨౨ వేల గ్రంథము లీగ్రంథాగారమునందు గలవు. భారతవర్షముయొక్క అన్ని భాగములనుండియు సంపాదింపఁబడిన గ్రంథములును నిందుగలవు. సంస్కృత గ్రంథములయొక్క భిన్నపాఠాంతరము లీగ్రంథాగారమునందుగలవు. ఈవిషయమునందు దీనితో సాటిరాతగినది మఱియొకటిలేదు. తంజావూరు గ్రంథాగారమునందున్న గ్రంథములను సంపాదించుట కేడులక్షల యేబదివేల రూపాయలైన వ్యయపడియుండునని డాక్టరు బర్నెలు దొరవారు అభిప్రాయపడుచున్నారు. అపూర్వము లగు ఆంధ్రభాషాగ్రంథము లనేకము మన కీగ్రంథాగారముననే దొరకియున్నవి. ఇంకను అముద్రితములగు ఆంధ్రగ్రంథము లనేకములు ఈగ్రంథాలయమునందు గలవు. వానికి ప్రతులు వ్రాయించి ఆంధ్రదేశమధ్య భాగమునందుండు ఏగ్రంథాలయమందైన జాగ్రత్తపెట్టి ఆంధ్రులకు అందుబాటునందుంచుట అత్యంత ఆవశ్యకమై యున్నది.

మైసూరునందున్న సరస్వతీ భాండాగారము పదునెనిమిది వత్సరములక్రిందట అగ్నిదేవున కాహుతియాయెను.

# శ్రీ సరస్వతీనిలయ వార్షికోత్సవము, ధర్మవరము

ఫిబ్రవరి నెల ౮ వ తేదీ మధ్యాహ్నము ఈసభ మిక్కిలి జయప్రదముగ జరిగెను. అనంతపురము, పెనుగొండనుండి ప్రముఖులగు న్యాయవాదులును కాలేజీ పండితులును, అనంతపురం హైస్కూలు ప్రధానోపాధ్యాయులును, ఇతర మండల ప్రముఖులును, డిస్ట్రిక్టు ఎడ్యుకేషనల్ కౌన్సిలరు శ్రీమతి ఉత్తా సుందరమ్మగారు మొదలగు నారీమతల్లులును పలువురు సభకువిచ్చేసియుండిరి. దివాన్ బహదూర్ టి. రామారావుగారు ప్రారంభమున కట్టమంచి రామలింగారెడ్డిగారి గుణగణముల ప్రశంసించుచు వారి సామర్థ్యమును వెల్లడించుచు అట్టివారు సభ కగ్రాసనాధిపతు లగుట కంగీకరించుట సరస్వతీనిలయ సభ్యుల పుణ్యమనిచెప్పి రెడ్డిగారిని సభాధ్యక్షత వహింపఁ బ్రార్థించిరి.

## రెడ్డిగారి యుపన్యాసము.

“నేను పండితుఁడనుగాను. కావలయునను కోరికయు నాకు లేదు. మనలో పండితు లనేకులు గలరు. కాని పాండిత్యమునకంటె ముఖ్యముగా కావలసినది రచనాశక్తి. లైబ్రరీలు (పుస్తక భాండాగారములు) పెంపొందించవలసినది పాండిత్యము గాదు. ఉన్నశక్తి నెట్లు వినియోగించిన జనులకు మేలు కలుగునో అట్టి అభ్యాసములను కలిగించవలెను. ఈ కాలమున జాతీయతా భావము ప్రబలుచున్నది. జపాన్, ఫ్రాంసు, అంగోరా మొదలగు నాగరికత దేశములలో మత సాంఘిక విభేదము లెన్నియైన నున్నవి. కాని ఆదేశములలో నందఱొక్కటిగా కట్టివైచు జాతీయతా భావమున్నది. ఇతర దేశీయుల వ్యవహారములలో పాల్గొనుచు ప్రత్యక్షముగా స్వదేశ లాభమును గడించు విధానమును మనము నేర్చుకొనవలయును. ఇతర దేశీయులు తమ దేశౌన్నత్యమును దృష్టియందుంచుకొనియే పనులు చేయుచుందురు. ఐరోపా యందంతటను మనకు తెలిసినట్లుగ త్వరలోనే ఆకాశ విమానములు వ్యాపించినవి. అందునకు కారణము యుద్ధమునందు తమ దేశము పైచేయిగా నుండవలయునని వారిలో నొక్కొక్కరును భావించుటయే. మనము దాస్యభూమిలో నున్నాము. కావున ఇతరులకంటె మిన్నగా నుండవలయునను భావము మనలో దట్టముగా లేదు. మనలో జాతీయత లేదు. ఎదుటివారి నాదర్శముగా గొని శాశ్వతాభివృద్ధి మార్గములకు ప్రయత్నించుటలేదు. లైబ్రరీలు ముఖ్యముగా జాతీయతను ప్రోత్సాహపరచవలయును.

మానవుని యభివృద్ధికి కావలసిన సాధనములు రెండు. జ్ఞానము మొదటిది. ఇది మంచి ఇది చెడ్డ, ఇది సక్రమము అని అక్రమము అను వివేచనాశక్తి యున్నగాని మనశీలము చక్కబడదు. రెండవది ఆచరణ. జ్ఞానము కలిగినను దాని ననుసరించి నడచువారు కొద్దిమంది. సత్యము, ధైర్యము మంచిగుణము లని అందఱు నెఱుఁగుదురు. కాని వాని నాచరణలో నుంచువారరుదు. పిల్లలు సహజముగా

ధైర్యశాలురు. కాని వారు ధైర్యమును గురించి యుపన్యాసము నియ్యజాలరు. వ్యాసమును వ్రాయలేరు. కావున జ్ఞానము కలిగియుండుట చాలు; దాని ననుసరించి ప్రవర్తించుట మేలు. దేశీయులయొక్క శీలమును జాతీయతాభావమును పెంపొందవలయునన్న జ్ఞానము ననుసరించి ప్రవర్తించ వలయునను ధైర్యమును, సత్యసంకల్పము నుండవలయును. ఇతర దేశములలో నీ లైబ్రరీ లెంత పని చేయునో చెప్పెదను.

జ్ఞానమునకు ఉత్పత్తి, వ్యాపకము నను రెండు దశలు కలవు. మహనీయులచే గొప్పసంగతులను వినినప్పుడు జ్ఞానము ఉత్పత్తియగును. కవులును మహనీయులును తమ ప్రతిభచే జ్ఞానమును సంపాదింతురు. సాధారణులమగు మనము అట్టివారిచే సంగతులను విని దానిని వ్యాపింపజేయవలెను. ఇప్పుడున్న విషయములకు వ్యాపకము బాగుగ జరిగిన గాని క్రొత్తసంగతు లుదయింపవు. మన ఆయుర్వేద వైద్యులవలె నున్నది. మూసిపెట్టినచో జ్ఞానము వృద్ధిచెందక నశించును. ఎప్పుడు దాచిపెట్టబడినదో అప్పుడే జ్ఞానముయొక్క నూతన వికాసము చచ్చిపోయినది. నూతన సృష్టి ఇప్పుడున్న వానిపైననే యాధారపడియుండును. కావున మనకు తెలిసిన సంగతు లెంత త్వరగా దేశమున వ్యాపించిన నంత మేలు. మనదేశపు పరిచయముగల అమెరికను డొకడిట్లు చెప్పెను: "హిందూ దేశములో నేదైన యొక క్రొత్తసంగతి వ్యాపించుటకు 75 సంవత్సరములు పట్టును. అమెరికాలో నదానికి 6 నెలలు చాలును." వేడి నీరుత్రాగుట మంచిదని యొకరు నేడు సిద్ధాంతీకరించి కనుగొనుడు, ఆ సంగతి మనదేశీయుల కందఱకును తెలియుటకు 75 యేండ్లు గావలయునట! ఏమందురా? అమెరికాలో ప్రతి గ్రామమున నొక లైబ్రరీ యున్నది. కాని లైబ్రరీలలో నెన్ని పుస్తకము లున్నను వాక్కుమూలమున గాని జ్ఞానము వ్యాపింపదు. అందుకొఱకై అమెరికను లైబ్రరీలలో వారమున కొకటి రెం డుపన్యాసములు జరుగుచుండును. మనవారింకను ప్రాచీనములైన భక్తి, భగవద్గీత, రామాయణములగురించిన యుపన్యాసముల పెట్టుకొనుచుందురు. ఇట్టి విప్పు డనవసరములని చెప్పక తప్పదు. ఏమందురా? మనయొక్క జాతివారము కనుక ఇంచుమించుగ నందఱిలోను ఇట్టిభావములు ప్రసరించి యుండును. వానినే పదిచోట్ల పదిమారులు వర్ణించినచో లాభములేదు. భారత భాగవత రామాయణములు మన జాతీయతావృక్షమునకు మొదలు వంటివి. ఎల్లకాలము వానికే ప్రదక్షిణము చేయుచుండుటలో నుపయోగములేదు. కాని ఆవృక్షమునను కొమ్మలు, చిగుళ్లు, ఆకులు, పుష్పములు, పండ్లు నుదయింపజేయవలెను. 10 వేల యుపన్యాసములైనను యిప్పుడున్న మాభక్తి కెచ్చుగాదు. లేనివారి కుదయింపదు. చెప్పవచ్చిన దేమన, క్రొత్తసంగతులను జనసామాన్యమునకు వ్యాపింపజేయుటే లైబ్రరీలకు ప్రధానకర్తవ్యమని. భక్తి, బాలగంగాధరతిలకులను మాటిమాటికి ప్రదర్శించుటకంటె ఆధునిక దేశచరిత్రలవిషయము చర్చించుట లాభకరముగా నుండును. ఇతరదేశముల పరిపాలనమును గురించియు వారి సంఘనిర్మాణమును గురించియు నప్పుడప్పుడుపన్యాసముల నుంచుకొన్నచో జనులకు నిజమగు ప్రబోధ ముదయించును. గ్రామపురోభివృద్ధినిగురించి నే నెక్కువ ప్రచారమును జరుపదలచినాను. అందఱును ధర్మవరమువంటి పట్టణములకు వచ్చి యుపన్యాసములను వినిపోవుట సాధ్యముగాదు. మనదేశములో గ్రామముల సంఖ్య హెచ్చు. ఇంకను మనవారికి శ్రుతి ప్రమాణము. కంటిలోకంటె చెవితోడనే వారు జ్ఞానమును సంపాదింతురు. కావున విద్యావంతులు వర్తమానమునకు సంబంధించిన రెం డుపన్యాసములైనను నెలనెలకు నేదో యొకగ్రామమునకు పోయి యిచ్చునట్లు శపథము చేసికొని పనిచేయవలెను. కడచినసంగతులే పలుమారు పారాయణముచేయుట వృథాప్రయాస. భూతము మరల పట్టియేయున్నది. ఆభూతమునే మరల మరల నాహ్వానించుట పనికిమాలిన పని. వర్తమానమును గలిపి భవిష్యత్తునకు దారి చూపవలయును. నానాటికి నభివృద్ధిజెందుటయే మన యాదర్శముగా నుండవలయును. మనముగూడ కాలప్రవాహముతో పోవలయునుగాని స్తంభించి యొకచో కూర్చున్నచో ఇతర దేశీయుల పరిహాసమునకు పాత్రులగుదుము.

లైబ్రరీలలో గ్రంథములైనను వర్తమాన శాస్త్రములను గురించి హెచ్చుగా నుండవలెను. లైబ్రరీల యుద్దేశ్యము జ్ఞానవ్యాపకముగాని పాండిత్యప్రకటనము గాదని తొలుతనే మనవిచేసికొంటిని. విద్యావ్యాపక శాఖ లితర దేశములలో గలవు. గ్రామ గ్రామములోను సభలు చేసి వారు బోధింతురు. ఇందునకు పాండిత్య మనవసరము. అందరకు నుపయోగపడునది పాండిత్యముగాదు. పై సంఘములవారు నూరారు మంది యుపన్యాసకులను తయారుచేసి గ్రామములకుపంపెదరు. వారికి కావలసినది సామాన్యజ్ఞానము. అట్లే లైబ్రరీ

లలో గూడ పాణిని, పతంజలి వ్యాకరణము లుండ పనిలేదు. వానికి స్థానము కళాశాలలు. వార్తా పత్రికలు, వర్తమాన పరిస్థితులను సంబంధించిన గ్రంథములును లైబ్రరీలలో నుండవలయును. వచ్చు నాదాయములో సగమైనను వార్తాపత్రికలకు వ్యయము చేయుటదోషముగాదు. కళాశాలలో ప్రాచీన గ్రంథములును లైబ్రరీలలో నవీన గ్రంథములు నుండుట న్యాయము. పూర్వపు కవులు గతించిపోయిరి. వారికి సంపాదనావశ్యకత లేదు. వర్తమాన కవులకు ప్రోత్సాహము కావలసి యున్నది. కాని మన మెప్పుడును తిక్కన కవిత్వమునకే తల ఆడించు చుండినచో శుష్కించి పోవుచున్న వర్తమానకవుల మాటయేమి? ఇదియా భాషాసేవ? లైబ్రరీలు కొంతవట్టుకు క్రొత్త కవుల నాదరింపకున్న నవియుండి ప్రయోజన మేమి? వారికి వ్యక్తులవల్ల పోషణము తక్కువ. లైబ్రరీలుగూడ ఉచితముగా గ్రంథములు కావలయునన్న వారిగతియేమి? ఒక్కడు నూరు లైబ్రరీలకుచితముగా పుస్తకముల నిచ్చుట కష్టము. నూరు లైబ్రరీ లొక్కని పుస్తకముల కొన్నచో వానికెంతయో సాహాయ్యము చేసినట్లుండును.

ఇదివఱకు నేటిజ్ఞానము వీనివలన విస్తరింప వలయునో చెప్పితిని. ఇట్లు జ్ఞానము విస్తరించినను దాని నాచరణకు దెచ్చు ధైర్యమును ఉత్సాహమును ప్రజలకు గలిగింపవలయును. విద్యావంతులు ఈ యాదర్శకములను తమ జీవితచరిత్రచే నుదాహరింప బడవలెను. విద్యావంతులు మేలైన పద్ధతులలో నడచుకొన్న నేగాని విద్యకు విలువయుండదు. మొదట నేను చెప్పినట్లు ధైర్యమును గుఱించి యుపన్యాసము జెప్పిన జాలదు. దానిని ప్రకటించుటకు అనుభవము గావలయును. దక్షిణహిందూస్థానములో మెదడు అభివృద్ధికి వచ్చినదిగాని చేతలు రాలేదు. దేశభక్తి యందఱకున్నది కాని దాని నాచరణకు తెచ్చినగదా ఫలితము? లోకలుబోర్డులలో మీదేశభక్తి దైనందినముగా నెట్లభివృద్ధి యగుచున్నదో కనుగొను పరీక్ష కిప్పుడెక్కువ యవకాశమున్నది. అనగా నిప్పుడు మీసంకల్పములను అనుభవమునకు తేవచ్చును. అదిలేని వట్టి సంకల్పమును జ్ఞానమును నిష్ప్రయోజనము. 1. జ్ఞానమును విస్తరింప జేయ వలయును. 2. దాని నాచరణకు దేవలయుననుటే నా యుపన్యాసమునందలి సారాంశము. మీరు కీర్తిని దేశమున కభివృద్ధిని గడింతురుగాక యని కోరుచు పరమేశ్వరుని ప్రార్థించుచున్నాను."

పిమ్మట బాలికా బాలురకు పఠనపరీక్షలు జరిగెను. అందులో నుత్తీర్ణులైన వారికి పుస్తకములు బహుమానముగా నియ్యబడెను. బ్ర. శ్రీ. ప్రయాగ వెంకట రామశాస్త్రిలుగారు దేశభాషలను గురించియు, శ్రీమతి ఉత్తా సుందరమ్మగారు పతిభక్తి నిగురించియు, మ. రా. శ్రీ. వై. యస్. హనుమంతరావుగారు ప్రకృతినుండి నేర్చుకొనదగిన విషయములను గుఱించియు నుపన్యసించిరి.

తర్వాత రెడ్డిగారు తమ యుపసంహారోపన్యాసమున నిట్లుచెప్పిరి:

"నేటిదినము ఈపురవాస్తవ్యుల కౌశలము చేతను కమిటీవారి శ్రద్ధచేతను నీయుత్సవము శ్లాఘాపాత్రముగా జరిగినది. దానిని గురించి హెచ్చుగ చెప్పుట ముఖస్తుతియగును. ఇది సర్వాంగసుందరముగా నడచినది. కార్యక్రమము మిక్కిలి శాంతముగా నడిచినది. సభాసదులకును ఉపన్యాసకులకును వందనములు. గ్రంథాలయములనుగురించి యిదివఱకే చెప్పితిని. అది వర్తమానపత్రికల దెప్పించి నవీనజ్ఞానమును చుట్టును వ్యాపింపజేయవలసినది, పాండిత్యమును గడించుటకంటె ప్రజాధర్మము లేవియో, ఎట్టిరీతుల నడవవలెనో విస్తరింపజేయ వలయునో తెలిసికొనుట ముఖ్యము. ఈకార్యముల నడపుటయందు అవలంబింపవలసిన యుపకరణముల జెప్పితిని. ఉపన్యాసము లిప్పించుటయు గొప్పవారు లేనప్పుడు చిన్నవారితోనే వారికి వారికి తెలిసిన సంగతుల జెప్పించుటయు ముఖ్యమైన పని. కలెక్టరులు మొదలగు నుద్యోగుల నాహ్వానించి రాజ్యాంగ పద్ధతులను వారినుండి వినవలయును. లోకలు బోర్డుల నెవిధముగ సంస్కరించిన వానినుండి లోకోపయోగ మగునను సంగతి యోచింపవలెను. ఇతర దేశ రాజ్యాంగ పద్ధతులను అన్నిజాతులకును సామాన్యమైన ప్రజల హక్కులను ప్రజల ధర్మములను చర్చించుట మేలే. గ్రంథములను, పత్రికలను తెప్పించి పెట్టిన చాలదు. వార్తాపత్రికలలోని అంశములను చదివి వినిపించవలయును. విద్యార్థులును వకీళ్ళును నెలకొక్క గ్రామమునకైన పోయి యుపన్యాసము లిచ్చునట్లేర్పఱచుకొనవలెను. ఈపద్ధతి మంచిదని గాంధీగారుగూడ చెప్పిరి. పద్ధతిమంచిదనిన చాలదు. ఆచరణకు తేవలయును. మామిడిపండు పేరులను అమరములో వర్ణించిన నోటికి రుచిరాదు. ఇంతకంటె విశేషములు చెప్పనక్కరలేదు. మీరు నన్ను గౌరవించినందుకు మీమేలును మరువను. ఈగ్రంథాలయము క్రమక్రమముగా వర్ధ

వృద్ధిజెంది మనదేశము నావరించిన అజ్ఞానతిమిరమును వెలుతురుగాను ఉండుగాక యని దేవుని ప్రార్థించు బోగొట్టుటకు దీపములో దీపముగాను, వెలుతురులో చున్నాను"

---

# భాండాగారములు—పుస్తకములు

కృష్ణామండల ప్రాథమికోపాధ్యాయ విదప మహాజనసభ కధ్యక్షులగు విస్సన్నపేట గుండేపల్లి జమీందారులు శ్రీమాతే గంగరాజుగారు తమ ప్రారంభోపన్యాసమందు ఇట్లు నుడివిరి:—

ఈమధ్య మనదేశములో భాండాగారములను గూర్చి మంచి ప్రయత్నము జరిగినది. గ్రంథాలయోద్యమమును గూర్చి యెక్కువ ప్రయత్నము చేయుతలంపుతో స్థాపింపబడిన గ్రంథాలయముద్రాక్షరశాల వ్యాపార బాహుళ్యమునకు దిగి అసలుద్యమమును విడిచి పెట్టినది. అంతటితో ప్రబోధము లేక యీయుద్యమము క్షీణించుచున్నది. ప్రసిద్ధులగు పండితులు, కవులు, భాషాభిమానులు చేరి ఆంధ్రగ్రంథముల జాబితాను తయారు చేసి పత్రికలలో ప్రకటింపవలయును. అట్టి గ్రంథముల పట్టిక ప్రతిబాలపాఠశాలకు పంపి, అదివరకందున్న గ్రంథములుపోను కావలసినవాని జాబితాను, తాలూకాబోర్డు ప్రసిడెంట్లకు, చెయిరుమనులకు, పాఠశాలమేనేజరులకు పంపిన యెడల 4-5 సంవత్సరములలో యేటేట కొన్నిగ్రంథముల చొప్పున గ్రంథభాండాగారము సంపూర్ణము చేయవచ్చును. ఆగ్రంథభాండాగారము స్కూలునకును, ప్రజలకును పనికివచ్చు స్థలమందుంచినయెడల గ్రామస్థులే అనేక గ్రంథముల నుచితముగా నిచ్చుచుందురు.

## పుస్తకములు

విద్యాధికారులలో డైరెక్టరు ఏమియు పుస్తకములు వ్రాసినట్లు గానుపించదు. ఇక ఇనస్పెక్టర్లు తఱచువ్రాసి వాని వ్యాపకమునకై ప్రయత్నించుచున్నారు. ఇనస్పెక్టర్లలో భాషావరులు బాలురకు చెప్పదగిన మహోత్కృష్టమైన ఉపదేశమున్నయెడల వారట్టిదానిని వ్రాసి తాలూకాబోర్డు ప్రసిడెంటుకు పంపినయెడల వారట్టి దానిని ముద్రించి స్వల్పమూల్యమునకు ఉపాధ్యాయుల కిచ్చుటయు అది బాలావబోధమై అత్యావశ్యకమైన యెడల ముద్రాపకు లెల్లరు ప్రచురించునట్లు చేసినపక్షమున నా ఇనస్పెక్టర్ల పేరు ఆచంద్రస్థాయిగా నుండును. అప్పుడు మహోత్కృష్ట విషయములు బయటకు వచ్చును. నేటికివలె తండోపతండములుగా గ్రంథములు ప్రచురింపబడవు. బీదబాలురు మోయలేనన్ని గ్రంథములు నియమింపరు. ఇనస్పెక్టరులకు వార్షికముగా గ్రంథవిక్రయము వలన వచ్చుదానిని జూచి విద్యావంతులగు వారికి జీతములు వృద్ధిచేయుటకై యోజింపవచ్చును. ఇనస్పెక్టరునకు పుస్తకవ్యాపారము లేకుండిన యెడల ఉపాధ్యాయునికిని ఉండదు. గురుపదవి మరల పూజ్యవంతమై యుండును. భారతదేశమందు గురుపదవికెన్నడును ఉచితమైన జీతము లేదు. అతనిస్వాతంత్ర్యమింత సంకుచితముగా నెన్నడును లేదు. ఆపదవి పూజనీయముగా నుండినగాని విద్యార్థులకాగురువునందు పూర్వపురీతిగౌరవము గలుగదు. యేటేట లక్షలకొలది రూప్యములు గ్రంథములక్రింద వ్యయమగుచున్నవి. పాఠ్యపుస్తకములు సంపూర్తిగానైన చెప్పబడుటలేదు. రామాయణ, భాగవత, భారతాదిగ్రంథ భాగములు, మహానుభావులు వ్రాసిన వచన గ్రంథములనేకమున్నవి. వానికి కాపీరైటులేదు. ముద్రాపకులు వానిని ముద్రించి మిక్కిలి తక్కువవెలకు పోటీగా నియ్యగలరు. అందువలన పుస్తకవ్యయముతగ్గును. బీదబాలురు సురక్షితులగుదురు. బజారులో 400 పేజీలగ్రంథము రు 0-8-0 లకమ్మబడుచుండగా స్కూలువిద్యార్థికి 100 పేజీల గ్రంథము రు 1-0-0 అమ్మబడుచున్నది. ఇది టెక్స్టుబుక్కు కమిటీ ఇనస్పెక్టరు, గ్రంథకర్త కలియుటవలన గలిగినదందురు. ఎంతకాలమీ బీదదేశము భరింపగలదు?

5 ఏండ్లనుండి ఉపాధ్యాయుల జీతము లెక్కువ చేయుమని అంద రైకకంఠ్యముగ నుద్ఘోషమొనర్చుచున్న యీ సమయమున, మధుర ఉపాధ్యాయ మహాజనసభా అధ్యక్షకాభిభాషణములలో ఉపాధ్యాయుడు వర్తకుడుగా పాఠశాలలంగడిగా మారుచున్నదను అపస్వరము వెలువడుటచేత అకారణములనారసి, ఔగాముల నిశ్చయించుటకై యీవిషయము నింతవిపులముగ విమర్శించినందులకు మహాజనులు మన్నింతురు గాక!

# గ్రంథాలయోద్యమము

గ్రంథకర్త: యాతగిరి లక్ష్మీ వేంకటరమణ

## వెల రు 0—8—0

ఇందు 1. ధర్మ గ్రంథాలయ స్థాపన. 2. ధర్మ గ్రంథాలయ పాలనము. 3. ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమము. 4. ప్రాచీన గ్రంథాలయములు — హిందూ దేశము. 5. బరోడా గ్రంథాలయోద్యమము—ఉద్యమ ప్రారంభము. 6. బరోడా గ్రంథాలయోద్యమము — కేంద్ర గ్రంథాలయము. 7. బరోడా గ్రంథాలయోద్యమము — ఉద్యమ నిర్మాణము. 8. గ్రంథాలయోద్యమము — విదేశ గ్రంథాలయములు. 9. గ్రంథాలయోద్యమము — ఇంగ్లాండు దేశము. 10. గ్రంథాలయోద్యమము — అమెరికా సంయుక్త రాష్ట్రములు— అను పది అధ్యాయము లున్నవి.

గ్రంథాలయోద్యమమునుగూర్చి విపులముగా దెలుపునట్టి గ్రంథము. బరోడా గాయక్వారుగారి పటము ఇందుగలదు. ప్రతిగ్రంథాలయమును, గ్రంథాలయోద్యమాభిలాషియు తప్పక చదువవలసినది.

వలయువా రిట్లు వ్రాయవలెను:—

ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము,

బెజవాడ.

RSVM01 A 127

20

## మీకేపుస్తకము కావలసినను

# వేంకటరామ కంపెనీ.

## పుస్తకముల షాపు

# బెజవాడ

## అనివార్యమవలెను

---

## ఫ్రెండ్సు కంపెనీ, బెజవాడ.

### మా కంపెనీ కొత్తడాబాలోనికి మార్చబడినది

అన్నివస్తువులు సరసమైన ధరలకు కావలయుననిన ఫ్రెండ్సు కంపెనీ కొకసారి దయచేయుడు. ఫౌంటెన్ పేనాలకు, తలనూనెలకు, సెంటులకు, తెలుగు పుస్తకములకు, సిగారులైటులకు, యెలెక్ట్రిక్ దీపములకు, లేసులకు, పన్నీరుబుడ్లకు, గ్లాసుసామానులకు ఫ్రెండ్సు కంపెనీకే వెళ్ళుడు.

---

# తొట్టివైద్యము.

కూనెగారి "అభినవవైద్యశాస్త్రము, ముఖవైఖరీవిద్య, రోగారోగ్యవివేకము, శిశుపోషణ" అను 4 గ్రంథములలోని సంగతులన్ని సులభశైలిని వ్రాయబడినది. తొట్టిస్నానములను గురించి వేఱొకగ్రంథము చదువనక్కరలేదు. 7 సంపుటములు. 36 అధ్యాయములు. 400 పుటలు. చక్కని బైండు. వెల ౩-0-0. (ప్రకృతి చందాదారులకు 2-8-0)

అడ్రెసు:—

మేనేజరు,

ప్రకృతి ఆఫీసు, బెజవాడ.

---

ఆంధ్ర గ్రంథాలయ ప్రెస్ (లిమిటెడ్) యందు
క. కోదండరామయ్యగారిచే ముద్రించి ప్రకటింపబడినది.

| మనసు ఫౌండేషన్ |
| --- |
| పుస్తకాల పరిశీలనాపట్టిక |

| | |
| --- | --- |
| పుస్తకం సంఖ్య | RSVM01A 127 |
| పుస్తకం పేరు | [illegible] సర్వస్వము |
| తారీఖు | 7/6/29 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 23 |
| పెద్ద సైజు పేజీలు | No |
| ఖాళీ పేజీలు | 1 |
| లేని పేజీలు | No |
| తయారు చేసినది | Sandhya |
| పేజీలు విడదీసినది | Sandhya |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | PRAGATHI |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనిది | |
| తప్పులు | No |
| పరిస్థితి | good |